హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106


సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65


జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	203	231
సూర్యాపేట	రూ.130	190	220
నల్లగొండ	రూ.146	210	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 24.0



ఇక ప్రచార సమరం

- అసెంబ్లీ ఎన్నికల ఊపుతో కాంగ్రెస్
- సామాజిక సమతుల్యత, దీటైన అభ్యర్థులతో బీఆర్ఎస్
- మూడోసారి మోదీ సర్కార్ నినాదంతో బీజేపీ
- రానున్న 50 రోజులు ఉమ్మడి జిల్లాలో హోరెత్తనున్న ప్రచారం



లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిష్ఠాత్మక పోరుకు తెరలేచింది. ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లకూ ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించడంతో ఇక ప్రచారపర్వం ముమ్మరం కానుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకోవడంతో రానున్న 50రోజుల పాటు ప్రచారం హోరెత్తనుంది. అసెంబ్లీ ఎన్నికల విజయాల ఊపుతో కాంగ్రెస్, ప్రజాసమస్యలపై పోరు ఎజెండాతో బీఆర్ఎస్, దేశంలో మరోసారి మోదీ సర్కార్ నినాదంతో బీజేపీ ప్రచారం సాగించేందుకు సిద్ధం కాగా, ప్రజాక్షేత్రంలో సమస్యలే ఎజెండాగా సీపీఎం రంగంలోకి దిగనుంది.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

యువనేతలతో బరిలోకి కాంగ్రెస్

అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో తిరుగులేని ఆధిక్యత సాధించిన కాంగ్రెస్, లోక్‌సభ ఎన్నికల్లో యువనేతలను బరిలో దింపింది. నల్లగొండ అభ్యర్థిగా పీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డి, భువనగిరి అభ్యర్థిగా పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి టికెట్లు ప్రకటించింది. గత ఎన్నికల్లో ఈ రెండు నియోజకవర్గాల నుంచి ప్రస్తుత మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రాతినిధ్యం వహించగా, ఈసారి యువనేతలకు పోటీ చేసే చాన్స్ దక్కింది. 2009నుంచి నల్లగొండ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుస్తూ వస్తుంటే, భువనగిరిలో ఒక్క పర్యాయం 2014లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందారు. లోక్‌సభకు వచ్చేసరికి ఈ సీట్లలో కాంగ్రెస్‌కు అనుకూలంగా తీర్పు వస్తుండడం, తమకు కలిసొచ్చే అంశంగా ఆ పార్టీ భావిస్తోంది. నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో ఈ రెండు లోక్‌సభ స్థానాల్లో 14 అసెంబ్లీ స్థానాలకు 12 సీట్లు కాంగ్రెస్ గెలుచుకోవడం ఆ పార్టీకి ప్లస్ పాయింట్‌గా నాయకులు చెబుతున్నారు. మంత్రులు, టికెట్లు ఆశించి భంగపడ్డ నేతలు, ఎమ్మెల్యేలు, క్యాడర్‌తో సమన్వయం చేసుకోవడం ప్రస్తుత అభ్యర్థులకు ఒక ఎత్తయితే అనుభవజ్ఞులు, సామాజిక సమీకరణాలు కలిసొచ్చే బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా జనాల్లోకి వెళ్లేందుకు అనుసరించే వ్యూహమే వీరికి ప్రధాన ప్రచారాంశం కానుంది.

దీటైన నేతలతో కదన రంగంలోకి బీఆర్ఎస్

అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని పరాజయం ఎదురవడంతో లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ వ్యూహం మార్చింది. ఒక సీటును బీసీలకు, మరోసీటును పార్టీ నేతలు, మాజీ ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకు కీలక నేతకు కేటాయించింది. నల్లగొండ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డిని, భువనగిరి అభ్యర్థిగా క్యామ మల్లేశ్‌కు టికెట్ ఇచ్చింది. ఉద్యమ సమయం నుంచి 2014లో భువనగిరి సీటులో విజయం తప్ప బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ప్రాతినిధ్యం దక్కలేదు. ఈసారి మాత్రం సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడంతో పాటు, పారాచూట్ లీడర్లను తోసిరాజని క్యాడర్ అభిప్రాయం మేరకు అభ్యర్థులను ఎంపికచేయడం, జిల్లాలో నెలకొన్న ప్రధాన సాగునీటి సమస్యను రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు తీసుకురావడం, రైతాంగాన్ని తమవైపు చూసేలా మార్గగలిగామనే అంశాలు కలిసొస్తాయని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. బీఆర్ఎస్ పూర్వపు ప్రజాప్రతినిధులకే బీజేపీ టికెట్ కేటాయించడం, పార్టీలో నేతల మధ్య సమన్వయం లేకపోవడం, పార్టీ క్యాడర్ ఇతర పార్టీల్లోకి జంప్ చేస్తుండడం బీఆర్ఎస్‌కు ప్రతికూల అంశంగా చెబుతున్నారు. కలిసొస్తాయని భావిస్తున్న సామాజిక సమీకరణాల సమతుల్యత, ఉమ్మడి జిల్లాలో నెలకొన్న సాగునీటి ఇక్కట్లు, కరువు అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అనుసరించే ప్రచార వ్యూహమే ఆ పార్టీ అభ్యర్థులకు కీలకం కానుంది.

మతతత్వంపై పోరు పేరుతో సీపీఎం

భువనగిరి నుంచి సీపీఎం తమ అభ్యర్థి జహంగీర్‌ను రంగంలోకి దించింది. కేంద్రంలో మతతత్వ బీజేపీ పాలనలో దేశంలో విద్వేషాలు పెరిగాయని, ప్రజల మధ్య అంతరాలు పెరుగుతున్నాయని, దేశంలో అవినీతిని ప్రభుత్వాలు పెంచి పోషిస్తున్నాయని వీటిని నియంత్రించడమే లక్ష్యంగా తమ పార్టీ ఎన్నికల ప్రచారం సాగిస్తుందని సీపీఎం చెబుతోంది. రైతాంగం కరువుతో అల్లాడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ కనీసం పట్టించుకోవడం లేదని ఈ సమస్యను ప్రస్తావిస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ప్రధాన పార్టీలను ప్రజాసమస్యలపై ఎండగట్టడమే లక్ష్యంగా తమ ప్రచారం సాగించేందుకు సీపీఎం సన్నద్ధమవుతోంది.

మూడోసారి మోదీ సర్కార్ నినాదమే బీజేపీ వ్యూహం

కేంద్రంలో మూడోసారి ప్రధాని నరేంద్రమోదీ సర్కార్ కొలువు దీరనుందని, బీజేపీ సాధించే 400 సీట్లలో నల్లగొండ జిల్లాకు ప్రాతినిధ్యం ఉండాలనే నినాదంతోనే ఆ పార్టీ జిల్లాలో ప్రచారం సాగించనుంది. రెండు సీట్లకు దీటైన అభ్యర్థులను బరిలో దింపాలనే లక్ష్యంతో రెండుసీట్లకు బీఆర్ఎస్ పూర్వపు నేతలకే టికెట్ ఇవ్వడం జిల్లాపై ఆ పార్టీ దృష్టిసారించిన విషయాన్ని తెలుపుతోంది. భువనగిరి స్థానం నుంచి బీసీ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌కు టికెట్ కేటాయించగా, నల్లగొండ స్థానం నుంచి హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డికి టికెట్ ప్రకటించింది. ఈ ఇద్దరు నేతలు బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ప్రజాప్రతినిధులే కావడంతో, ఆ పార్టీ ఓటింగ్‌ను తమవైపు తిప్పుకుంటామనే సంకేతాలతో పాటు, బీసీ ఓటర్లను ఆకర్షించేందుకు ఉపయోగపడుతుందని పార్టీ అంచనా వేస్తోంది. అవినీతిరహిత పాలనతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రధాని మోదీని ప్రజలు విశ్వసిస్తున్నారని, తెలంగాణలో కాంగ్రెస్ , బీఆర్ఎస్ పార్టీలు అవినీతి, కుటుంబపాలనతో భ్రష్టుపట్టిస్తున్నాయనే అంశాలను బీజేపీ ప్రధానంగా జిల్లాలో ప్రచారం చేయనుంది. కాంగ్రెస్ ఆరుగ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలుచేయడం లేదని బీజేపీ ఆరోపిస్తోంది.

● కామెంట్ ఆఫ్‌ది డే

ఉమ్మడి జిల్లాను మూడు కుటుంబాలే

ఏలుతున్నాయ్

- అభ్యర్థి మార్పు అబద్ధపు ప్రచారమే
- బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి

కాంగ్రెస్ 100 రోజుల పాలనలో ఎవ్వరూ

సంతోషంగా లేరు

- రైతులను ఆ పార్టీ పట్టించుకోవడం లేదు
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

దేశంలో బీజేపీతోనే

సుస్థిర పాలన

- యువత ఉపాధి కోసం ఇండస్ట్రియల్ పార్క్
- బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

●7లో..

● ఆఫీసర్ పాయింట్

సరిహద్దులో

పటిష్ఠ నిఘా

- అంతరాష్ట్ర అధికారుల సమావేశంలో కలెక్టర్లు

తుంగతుర్తికి దక్కిన ఎంపీ టికెట్

యాదాద్రి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి)/ మోత్కూరు: భువనగిరి ఎంపీ కాంగ్రెస్ టికెట్ కోసం హేమాహేమీలు పోటీపడగా, చివరికి తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన నేతకు దక్కింది. కాంగ్రెస్ అధిష్ఠానం తుంగతుర్తి నియోజకవర్గం, శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి భువనగిరి ఎంపీ టికెట్ ఖరారు చేసింది. దీంతో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచాకాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. నల్లగొండ ఎంపీ అభ్యర్థిని ప్రకటించినప్పుడు భువనగిరి అభ్యర్థిని ప్రకటించకుండా అధిష్ఠానం పెండింగ్‌లో పెట్టింది. ఈ టికెట్ కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోదరుడి కుమారుడు కోమటిరెడ్డి సూర్యపవన్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మి గట్టి ప్రయత్నం చేశారు. బీసీ అభ్యర్థిని నిలబెట్టాలనే డిమాండ్ కూడా తెరపైకి రాగా, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి వస్తారని, ఆయనకే టికెట్ ఇస్తారనే ప్రచారం సాగింది. చివరికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల అయోమయానికి తెరదించుతూ అధిష్ఠానం చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇచ్చింది.



పేరు: చామల కిరణ్‌కుమార్‌రెడ్డి
పుట్టిన తేదీ: 24-10-1974
తల్లిదండ్రులు: అరుణ, వాసుదేవరెడ్డి
స్వగ్రామం: శాలిగౌరారం
విద్యార్హత: హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా
పార్టీ పదవులు: 2005-06 వరకు ఏపీ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, 2007-08 వరకు రాహుల్‌గాంధీ టీం డిస్కవరీ ఇండియా టాస్క్‌ఫోర్స్ మెంబర్, ఆమ్ ఆద్మీకా సిపాహీ నేషనల్ కోఆర్డినేటర్, 2008-09 వరకు జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి, 2009-11 వరకు జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, 2017- 21 వరకు టీపీసీసీ అధికార ప్రతినిధి, 2021 నుంచి టీపీసీసీ ఉపాధ్యక్షుడు

370 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు

కలెక్టర్ దాసరి హరిచందన



అర్జాలబావిలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నల్లగొండ టౌన్, మార్చి 28: యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 370 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. గురువారం ఆమె నల్లగొండ సమీపంలోని అర్జాల బావి వద్ద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గొల్లగూడెం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. వరి కోతలు పూర్తయిన ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రారంభించనున్నట్లు వివరించారు. అంతకుముందు కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ వేసవిలో తక్కువ నీటితో పండించే ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీసీవో ఆర్ కిరణ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, డీఆర్‌డీవో నాగిరెడ్డి, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి శ్రీకాంత్, తహసీల్దార్ శ్రీనివాస్‌తోపాటు, అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యాన్ని ఏప్రిల్ చివరి నాటికి పూర్తి చేయాలి

మిర్యాలగూడ: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) చెల్లింపు లక్ష్యాలను ఏప్రిల్ చివరి నాటికి వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ దాసరి హరిచందన కోరారు. గురువారం మిర్యాలగూడలోని పద్మశ్రీ రైస్‌మిల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సీఎంఆర్‌ను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో రైస్‌మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2023-24 వానాకాలానికి సంబంధించి సీఎంఆర్ ప్రతీ రోజు 4వేల మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉండగా మిల్లర్లు 50 శాతం మాత్రమే చెల్లిస్తున్నారని, దీనిని తక్షణమే వంద శాతానికి పెంచాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌరసరఫరాల జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, మిర్యాలగూడ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కర్నాటి రమేష్, నారాయణ పాల్గొన్నారు.

వయో వృద్ధులందరికీ ఇంటి నుంచే ఓటింగ్

నల్లగొండ టౌన్: లోకసభ ఎన్నికల్లో 85 ఏళ్లు నిండిన వయో వృద్ధులందరూ ఇంటి నుంచే ఓటింగ్ విధానాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ దాసరి హరిచందన సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఓటరు అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఎన్నికల సంఘం 80 సంవత్సరాలు నిండిన వారికి హోం ఓటింగ్ సౌకర్యం కల్పించిందని, లోక్ సభ ఎన్నికలలో దానిని 85సంవత్సరాలకు పెంచినట్లు తెలిపారు. అందువల్ల 85 ఏళ్లు పైబడిన ఓటర్లందరూ హోం ఓటింగ్ సౌకర్యం వినియోగించుకోవాలన్నారు.

పెండింగ్ పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలి

తహసీల్దార్లు రెవెన్యూ అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ హరిచందన ఆదేశించారు. కలెక్టరేట్‌లో తహసీల్దార్లతో రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలి

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచందర్ అన్నారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నుంచి పెద్ద గడియారం సెంటర్‌వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు అనే ఆయుధం ద్వారా మంచి నాయకున్ని ఎన్నుకుంటే భవిష్యత్ బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డా.బొమ్మరబోయిన కేశవులు, జలసాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ, ప్రిన్సిపల్ డా ఘనశ్యామ్, అడ్వకేట్ కన్నెబోయిన ఉషారాణి, వైస్ ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పోస్టులు చేస్తే చర్యలు : ఎస్పీ

నల్లగొండ టౌన్, మార్చి 28: సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు చేస్తే చర్యలు తప్పవని ఎస్పీ చందనాదీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియాలో విద్వేషకర, తప్పుడు పోస్టులు, మార్ఫింగ్ చేసి ఫొటోలు, రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టే వారిపై చట్ట ప్రకారం కేలు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు.

కల నెరవేరే సమయం

- స్కిల్ యూనివర్సిటీగా ఎస్ఆర్‌టీఆర్ఐ
- ఎన్నో ఏళ్ల నిరీక్షణకు దక్కనున్న ప్రతిఫలం

'పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు.. పల్లెలు అభివృద్ధి చెందకుండా దేశం మనుగడ సాధించబోదు.' అని చాటిన మహాత్మాగాంధీ సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామంలో 'స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ - ఎస్ఆర్‌టీఆర్ఐ' ను స్థాపించారు. స్థానిక వనరులను వినియోగించుకుంటూ గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో ఏర్పాటైన ఈ సంస్థ గత పాలక ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురై నేటికీ.. గ్రామీణ విశ్వవిద్యాలయంగా రూపొందలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీగా ఏర్పాటు చేయాలనే యోచన చేస్తుండడంతో ఇక్కడ ప్రజల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

భూదాన్‌పోచంపల్లి

మహోన్నత లక్ష్యంతో 1995 డిసెంబరు 3న అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు 'స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ'ను ప్రారంభించారు. పీవీ ఆశల సౌధమైన ఈ సంస్థ ప్రస్తుతం నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. ఇప్పటికీ మూడు దశాబ్ధాలు కావస్తున్నా.. ఈ సంస్థను గ్రామీణ విశ్వవిద్యాలయంగా మార్చే ప్రతిపాదన ప్రభుత్వాల పరిశీలనలోనే ఉంది. తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో ప్రారంభించిన రూరల్ ఇన్‌స్టిట్యూట్‌లు ఇప్పటికే విశ్వవిద్యాలయాలుగా రూపుదిద్దుకున్నాయి. కాగా, స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థను గ్రామీణ విశ్వవిద్యాలయం (రూరల్ వర్సిటీ)గా రూపుదిద్దుతారనే కల నేటికీ నెరవేరలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంస్థ ఏర్పాటు సమయంలో ప్రతి ఆర్థిక సంవత్సరానికి పరిపాలన, జీతభత్యాలు, సంస్థ విస్తరణ నిమిత్తం ప్రణాళికా వ్యయం రూ. 2 కోట్లుగా కేటాయించారు. ప్రభుత్వం అందించే నిధులు కేవలం ఉద్యోగుల వేతనాలకు కూడా చాలకపోవడంతో గతంలో ఈ సంస్థకు దిశానిర్దేశం చేసే గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ అంతర్భాగమైన 'సెర్ప్' నుంచి ఉద్యోగుల జీత భత్యాలకు కొంత నగదును బదులుగా సర్దుబాటు చేసుకోవడం సంస్థ దుర్భర పరిస్థితికి దర్పణం పడుతోంది. ఈ సంస్థకు పూర్తిస్థాయిలో గవర్నింగ్ బాడీ లేదు. చైర్మన్ లేక 12 ఏళ్లు గడిచింది. గత బీఆర్ఎస్ పాలనలో పదేళ్లు ఈ సంస్థ అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా మారింది.

నిరుపయోగంగా మారిన సీడ్ టెస్టింగ్ ల్యాబ్

గ్రామీణ రైతులకు విత్తనశుద్ధి, విత్తన నాణ్యత అంశాలను, జన్యు పరీక్షలను నిర్వహించి తెల్పి చెప్పేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సీడ్ టెస్టింగ్ ల్యాబ్ నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ఈ యూనిట్ వినియోగంలో లేకపోవడంతో మూతపడింది. ఈ-గురుకులం కోర్సును మొక్కుబడిగా నిర్వహించి అది కూడా ఎత్తివేశారు. సంస్థ నిర్వహణకు తగిన నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రూరల్ వర్సిటీ హుళక్కేనా..?

గ్రామీణాభివృద్ధి శాఖకు అనుబంధంగా ఉన్న ఏఎంఆర్-అపార్డ్ శిక్షణ సంస్థను గ్రామీణ విశ్వవిద్యాలయంగా మార్చుతూ.. యూనివర్సిటీకి వైఎస్ఆర్ పేరు పెట్టాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో కేసీఆర్ కూడా ఈ సంస్థను విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దడంతోపాటు హ్యాండ్లూమ్ రీసెర్చ్ అండ్ డిప్లొమా కోర్సులను ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. అయినా ఆ హామీ నెరవేరలేదు.

సుముఖత వ్యక్తం చేసిన సీఎం

కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, పార్టీ సీనియర్ నేత తడక వెంకటేష్‌లు సీఎం రేవంత్‌రెడ్డిని ఇటీవల కలిసి యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని విన్నవించారు. దీంతో స్పందించిన ఆయన సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు.



జాతీయ విద్యామండలి కింద 1986లో రామానందతీర్థ గ్రామీణ సంస్థను మంజూరు చేయగా 1995లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రారంభించారు. పీవీ నరసింహారావు తన గురువు అయిన స్వామి రామానందతీర్థ పేరిట దీన్ని నెలకొల్పారు. గ్రామీణ యువతకు 15 రకాల కోర్సులపై వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం కింద దేశవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమానికి ఈ సంస్థను కేంద్ర ప్రభుత్వం ఎంచుకుంది. ఇక్కడ కోర్సుల నిర్వహణకు నిధులు ఇస్తోంది. సంసద్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.3.70కోట్లు ఇస్తోంది. ఇక్కడి కోర్సులకు జాతీయ వృత్తి విద్యా శిక్షణ కోర్సుల మండలి (ఎన్‌సీఈటీ) గుర్తింపు ఉంది. సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో లక్షా 75వేల చదరపు అడుగుల్లో ప్రధాన భవనంతోపాటు మరో ఏడు వర్క్‌షాప్‌లు, నాలుగు కంప్యూటర్ ల్యాబ్‌లు, 350 మందికి సరిపడా మూడు వసతి గృహాలు ఉన్నాయి. ఈ సంస్థలో నిర్వహించే శిక్షణ కార్యకలాపాలపై ఇప్పటికే గుజరాత్ సహా పలు రాష్ట్రాల ప్రభుత్వ అధికారుల బృందాలు అధ్యయనం చేశాయి.

15 రకాల కోర్సులు

నైపుణ్య విశ్వవిద్యాలయంగా..

భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 'నైపుణ్య విశ్వవిద్యాలయం - స్కిల్ యూనివర్సిటీ'గా మార్చాలని భావిస్తోంది. దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఇప్పటికే పంచాయతీరాజ్‌శాఖను ఆదేశించింది. రాష్ట్రంలో ఉపాధి కల్పన, పారిశ్రామిక అవసరాలకు అవసరమైన మానవ వనరులను తయారు చేసేందుకుగాను తొమ్మిది ఉమ్మడి జిల్లాలతోపాటు కొడంగల్‌లో కలిపి పది నైపుణ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో ఉపాధి ఆధారిత స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సులను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఇందుకోసం విద్య, పరిశ్రమలు, కార్మిక శాఖల కార్యదర్శులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేసింది. గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఒడిషా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అధ్యయనానికి ఆదేశాలు జారీ చేసింది. నైపుణ్య విశ్వవిద్యాలయాలపై అధ్యయనంలో భాగంగా భూదాన్‌పోచంపల్లి మండలంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థపై కమిటీలో చర్చ జరిగింది.

నాటకం సమాజాన్ని ప్రభావితం చేస్తుంది

● **తెలుగుశాఖ ఆచార్యులు వంగరి త్రివేణి**



సమావేశంలో మాట్లాడుతున్న వంగరి త్రివేణి

నల్లగొండ కల్చరల్, మార్చి 28: నాటకం సమాజాన్ని ప్రభావితం చేస్తుందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ తెలుగుశాఖ ఆచార్యులు వంగరి త్రివేణి అన్నారు. పట్టణంలోని ఎన్జీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'నాటక సాహిత్యం' అనే అంశంపై గురువారం నిర్వహించిన జాతీయ సదస్సు రెండో రోజు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పురుషులే కాకుండా స్త్రీలు కూడా చాలా మంది నాటకాలను రాసి నాటక సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు. తెలంగాణ భాషా సంస్కృతి మండలి అధ్యక్షుడు జలేందర్‌రెడ్డి మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తెలంగాణ సాహిత్యానికి ఆదరణ కరువైందన్నారు. కళాశాల ప్రధానాచార్యులు సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ తెలుగు భాషకు ప్రపంచంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో నాటక రంగ పరిశోధకుడు తాటికొండల నర్సింహారావు, ఎంవీ రఘువీర్ ప్రతాప్, రంగస్థల నటుడు బక్క పిచ్చయ్య, నర్సింహారావు, తెలుగుశాఖ అధ్యక్షుడు తండు కృష్ణకౌండిన్య, అధ్యాపకులు దీపిక, శ్రీధర్, గోవర్ధనగిరి, ప్రభాకర్, సైదులు, లింగస్వామి, రమ్య, అంజయ్య, గ్రంథ పాలకులు దుర్గప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ కడారి మల్లేష్, నాగుల వేణు, ప్రవీణ్‌రెడ్డి, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత

అనంతగిరి, మార్చి 28: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని శాంతినగర్ చె కోపోస్టు వద్ద గురువారం రూ.89,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు జగ్గయ్యపేటకు కారులో వెళ్తుండగా, చెక్‌పోస్టు వద్ద వారిని తనిఖీ చేయగా వారి వద్ద రూ. 89,500 నగదును గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ నగదును స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారికి అప్పగించినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50వేలకు మించి నగదును ఎవరూ తీసుకెళ్లవద్దని సూచించారు.

గుట్టలో స్వాతి నక్షత్ర పూజలు

● వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం



లక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, మార్చి 28: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దివ్యక్షేత్రంలో గురువారం స్వాతినక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వేకువజామున స్వయంభువులను మేల్కొలిపి, ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర శత ఘటాభిషేకం జరిపించారు. అంతకుముందు 108 కలశాలలో వివిధ ఫల రసాలు, పంచామృతాలతో పూజలు చేపట్టి పంచసూక్త పఠనంతో హోమం నిర్వహించి ఉత్సవమూర్తులను, ప్రతిష్ఠా అలంకారమూర్తులను అభిషేకించారు. లక్ష్మీ నరసింహుడిని ఆరాధిస్తూ ప్రత్యేకంగా కొలిచి తిరువారాధన, బాలభోగం, నిజాభిషేకం, నిత్యకల్యాణం నిర్వహించారు. అనుబంధ ఆలయం పాతగుట్టలోనూ శతఘటాభిషేకం నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా వేకువ జాము నుంచి భక్తులు అధికసంఖ్యలో గిరి ప్రదక్షిణలు చేసి స్వామిని దర్శించుకున్నారు.

స్వామిని దర్శించుకున్న ఐజీపీ రమేష్‌రెడ్డి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీపీ) రమేష్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి పండితులు ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో

కుల పాలన చేయొద్దు

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



మునుగోడులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

మునుగోడు, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం చూపుతోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. నల్లగొండ జిల్లా మునుగోడులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ కులపాలన సాగించే యత్నాలు చేయవద్దని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బీసీలపై వివక్ష చూపుతోందన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆచరణలో మాత్రం వాటన్నింటినీ విస్మరిస్తోందని విమర్శించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 34సీట్లు ఇస్తామని మాట తప్పని అన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీసీలపై వ్యతిరేక వైఖరిని అవలంబిస్తోందన్నారు. కులగణన చేపట్టాలని రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ ప్రకటించి బీసీలపై అనుకూలమైన వైఖరి చూపారని, వారి పేరుతో చెలామణి అవుతూ వారి ఉద్దేశాలు అమలు చేయకపోవటం ఏమిటని ప్రశ్నించారు. ఇది మోసపూరిత విధానమన్నారు. ఇప్పటికైనా బీసీల వివక్షత చూపే వైఖరి మార్చుకోవాలన్నారు. అగ్రకులాలకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు అగ్రవర్ణ వర్గాలకు సైతం జనాభా ప్రకారం చట్ట సభలో సమూచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బూడిద లింగయ్యయాదవ్, నాయకులు మేకల మల్లయ్య, బొల్లం వెంకన్న, జాజుల భాస్కర్, వెంకటేశం, సత్యనారాయణ, గురిజ నర్సింహా, కైలాసం గౌడ్, ఆవుల శ్రీను, రాజు పాల్గొన్నారు.

సరిహద్దులో నిఘా పటిష్టం

- అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు
- సీసీ కెమెరాలతో 24 గంటల పర్యవేక్షణ
- సమీక్షా సమావేశంలో కలెక్టర్ హరిచందన





తెలుగు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల ఉన్నతాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన, చెక్‌పోస్టు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్లు, ఎస్పీలు

దామరచర్ల, మార్చి 28: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర సరిహద్దులో నిఘా పటిష్టం చేశామని నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని రాష్ట్ర సరిహద్దు వాడపల్లి వద్ద గురువారం నిర్వహించిన అంతర్రాష్ట్ర సరిహద్దు జిల్లాల అధికారుల సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర సరిహద్దులైన నల్లగొండ-పల్నాడు జిల్లాల అంతర్రాష్ట్ర సరిహద్దులో మూడు చెక్‌పోస్టులు, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల సరిహద్దులో ఏడు చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 10 చెక్‌పోస్టుల్లో ఏడు శాఖల అధికారులతో నిరంతరం సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు నల్లగొండ జిల్లాలో రూ.4.5కోట్లు విలువ చేసే నగదు, మద్యం, ఆభరణాలను సీజ్ చేశామన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి డబ్బు, మద్యం సరఫరా చేస్తే స్వాధీనం చేసుకుంటామన్నారు. ప్రధానంగా నాగార్జునసాగర్ చివరి ఆయకట్టు ప్రాంతంలో నిఘాను పటిష్టం చేశామన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో డబ్బు, మద్యం, ఇతరత్రా అక్రమ రవాణా జరగకుండా సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

అన్ని శాఖల సమన్వయంతో నిఘా

● సూర్యాపేట కలెక్టర్ వెంకటరావు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అన్ని ప్రభుత్వశాఖల అధికారులతో సరిహద్దులో నిఘాను పటిష్టం చేశామని సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకటరావు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అన్నిశాఖల అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఒక్కో చెక్‌పోస్టులో ఎనిమిది మంది అధికారుల చొప్పున 24 గంటలు సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. అక్రమ రవాణాను అరికట్టి ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం పల్నాడు జిల్లా కలెక్టర్ శివ మాట్లాడుతూ ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు ఇరు రాష్ట్రాల అధికారులు పరస్పరం సమాచారాన్ని తెలుసుకునేలా వాట్సాప్‌గ్రూప్ ఏర్పాటు చేయడమే కాకుండా అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం వారు సరిహద్దులోని చెక్‌పోస్టుల్లోని రికార్డులను పరిశీలించారు.

అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్పీలు

అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నల్లగొండ జిల్లా ఎస్పీ చందనదీప్తి, సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే హెచ్చరించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల మీదుగా అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌తో కలిసి వారు మాట్లాడారు. సరిహద్దు వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రధానంగా కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో నది గుండా అక్రమ రవాణా అరికట్టేందుకు సరిహద్దు మండలాల అధికారులను సమాయత్తం చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, నటరాజన్‌తో పాటు ఆదాయపుశాఖ, అటవీ, రెవెన్యూశాఖలతోపాటు పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు చేస్తే చర్యలు : ఎస్పీ

నల్లగొండ టౌన్: సోషల్‌మీడియాలో తప్పుడు పోస్టులు చేస్తే చర్యలు తప్పవని ఎస్పీ చందనాదీప్తి ఒక ప్రకటనలో హెచ్చరించారు. సోషల్ మీడియాలో విద్వేషకర, తప్పుడు పోస్టులు, మార్ఫింగ్ చేసి ఫొటోలు, రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉంగే పోస్టులు పెట్టే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రత్యేక సోషల్ మీడియా సెల్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అభ్యంతరకరమైన పోస్టులు తప్పుడు వార్తలు పెట్టే వారిపై ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయనున్నట్లు ఆమె హెచ్చరించారు.

అప్పులు ఎగ్గొట్టేందుకు హత్య

- బౌరవాణి మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ
- ముగ్గురు నిందితుల అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు



హత్య కేసు మిస్టరీ వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ టౌన్, మార్చి 28: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధాన్ని నెరపడంతో పాటు ఇచ్చిన అప్పు తిరిగి ఇవ్వాలని అడగటమే ఆమె హత్యకు కారణమైంది. కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శివరాంరెడ్డి గురువారం విలేకరులకు వివరించారు. నార్కట్‌పల్లి మండలం ఔరవాణి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ముప్పిడి పిచ్చమ్మ(63) భర్త కొంతకాలం కిందట మృతి చెందాడు. ఈ దంపతులకు పిల్లలు కూడా లేకపోవటంతో ఇంటి వద్దనే ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన సిలివేరు లక్ష్మయ్యతో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. పిచ్చమ్మ తన దగ్గర ఉన్న డబ్బుల్లో రూ.1.50లక్షలు లక్ష్మయ్యకు అప్పుగా ఇచ్చింది. ఆ డబ్బులు ఇవ్వాలని తరచూ లక్ష్మయ్యను అడుగుతుండటంతో వాయిదా వేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన నకిరేకంటి చంద్రయ్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్న పిచ్చమ్మ అతడికి కూడా రూ.1లక్ష అప్పుగా ఇచ్చింది. అదే గ్రామానికి చెందిన నారబోయిన అంజయ్యకు కూడా రూ.40వేలు అప్పుగా ఇచ్చింది. అప్పు తీర్చాలని పదేపదే అడుగుతోందని లక్ష్మయ్య, చంద్రయ్య, తాను అప్పుతీర్చినా రూ.40వేలు మళ్లీ కట్టించుకుందని అంజయ్యలు పిచ్చమ్మపై ఆగ్రహం పెంచుకున్నారు.

పథకం ప్రకారం హత్య...

వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవించే ఈ ముగ్గురు ఒక సందర్భంలో కలిసినప్పుడు పిచ్చమ్మ విషయం ప్రస్తావనకు వచ్చింది. ఆమెను అంతమొందించి తమ అప్పు ఎగ్గొట్టవచ్చని సిలివేరు లక్ష్మయ్య, నకిరేకంటి చంద్రయ్య భావించగా, తన ప్రతీకారం తీరుతుందని నారబోయిన అంజయ్య అంగీకరించాడు. లక్ష్మయ్య సూచన మేరకు ఈ నెల 21వ తేదీ రాత్రి పిచ్చమ్మ గ్రామ శివారులోని నకిరేకంటి అచ్చయ్య బావి వద్దకు చేరుకుంది. అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న లక్ష్మయ్య, చంద్రయ్య, అంజయ్యలు ఆమెపై కర్రలతో దాడి చేయడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందింది. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న 2.8 గ్రాముల బంగారు పుస్తెలతాడు తీసుకుని మృతదేహాన్ని అక్కడే ఉన్న పాడుపడిన బావిలో పడేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మిస్సింగ్ కేసుగా నమోదు

పిచ్చమ్మ ఇంటికి తిరిగిరాక పోవడంతో గ్రామస్థుల సమాచారం మేరకు మునుగోడు మండలం పులిపలుపుల గ్రామానికి చెందిన ఆమె సోదరుడు పందుల యాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నార్కట్‌పల్లి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ నెల 24న ఔరవాణి గ్రామ శివారులోని పాడుబడిన బావి నుంచి దుర్వాసన వస్తున్నట్లుగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమివ్వడంతో వెలికితీయించి పిచ్చమ్మదిగా గుర్తించారు. మృతురాలి బంధువుల సమాచారం మేరకు లక్ష్మయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. ఈ ఘటనలో పాల్గొన్న అంజయ్య, చంద్రయ్యలను కూడా అదుపులోకి తీసుకుని వారినుంచి పుస్తెలతాడును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించేందుకు ప్రతిభ చూపిన నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ అంతిరెడ్డిలను అభినందించారు.

పెళ్లి చేసుకోమన్నారని యువకుడి అదృశ్యం



సందీప్ (ఫైల్)

తిప్పర్తి, మార్చి 28: పెళ్లి చేసుకోవాలని కుటుంబసభ్యులు అన్నందుకు ఓ యువకుడు ఇంటి వెళ్లిపోయాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని అనిశెట్టి దుప్పలపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గంటకంపు కృష్ణయ్య కుమారుడు సందీప్ (27) 10వ తరగతి వరకు చదివి కూలీ పనులు చేసుకుంటూ తన స్వగ్రామంలోనే నివాసం ఉంటున్నాడు. తల్లి వెంకటమ్మ ఈ నెల 27న ఉదయం ఇంట్లో ఉన్న సమయంలో నువ్వు పెళ్లి చేసుకోవాలని కుమారుడికి సూచించింది. దీంతో మనస్తాపం చెందిన సందీప్ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. దీంతో బంధువులు, అతని స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో తన అక్క దర్శనం రేణుక గురువారం తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

భార్యతో గొడవపడి మరో యువకుడు..



అనిల్‌కుమార్ (ఫైల్)

తిప్పర్తి, మార్చి 28: భార్యతో గొడవపడి ఓ యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా, వినుకొండ మండలానికి చెందిన కుంట అనిల్‌కుమార్ (26)కు ఖమ్మం జిల్లాకు చెందిన కుంట పవిత్రతో మూడేళ్ల క్రితం వివాహమైంది. మాడ్గులపల్లి మండల కేంద్రానికి సమీపంలో ఉన్న టోల్‌గేట్‌లో అనిల్‌కుమార్ ఎనిమిది నెలల క్రితం షిఫ్ట్ మేనేజర్‌గా జాయిన్ అయాడు. దీంతో దంపతులు తిప్పర్తి మండల కేంద్రంలో ఓ గది కిరాయికి తీసుకొని నివసిస్తున్నారు. ఈ నెల 22వ తేదీన భర్త అనిల్ ఫోన్‌లో ఓ గుర్తు తెలియని అమ్మాయి ఫొటో ఉండడంతో ఆ ఫొటో ఎవరిదో చెప్పాలని భార్య నిలదీసింది. దీంతో భార్యాభర్తల మధ్య తగాదా జరిగింది.

ఈ క్రమంలో అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో భార్య పవిత్ర ఫోన్‌తో పాటు తన ఫోన్ కూడా తీసుకొని స్విచ్ఛాఫ్ చేసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం తల్లిదండ్రులకు సమాచారం అందించి వెతికినప్పటికీ ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో అనిల్‌కుమార్ భార్య పవిత్ర తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాంమూర్తి తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

● నల్లగొండలో భర్త మృతి, భార్యకు గాయాలు

నల్లగొండ టౌన్, భువనగిరి రూరల్, మార్చి 28: రెండు వేర్వే రు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, ఒకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదాలు నల్లగొండ జిల్లా మండల పరిధిలోని కాకులకొండారం, యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని రెడ్డినాయక్‌తండా లో చోటుచేసుకున్నాయి.

● రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.... మండల పరిధిలోని కాకులకొండారం గ్రామానికి చెందిన కుడుతాల నర్సింహ(42) నల్లగొండ మునిసిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజువారీగా బుధవారం నల్లగొండకు వచ్చి విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్నాడు. కిరాణ సామగ్రి కోసం నల్లగొండకు వచ్చిన భార్య చంద్రకళను తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో బైక్ మునుగోడు రోడ్డులోని రాఘవేంద్ర బీఈడీ కళాశాల వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహ, అతని భార్య చంద్రకళకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన వాహనదారులు 108కు సమాచారం అందించడంతో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ భర్త నర్సింహ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య చంద్రకళ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆయన తెలిపారు. మృతుడు నర్సింహకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి సోదరుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.



నర్సింహ (ఫైల్‌ఫొటో)

● యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని రెడ్డినాయక్‌తండాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బొల్లేపల్లికి చెందిన వనం సుమన్ (24) హైదరాబాద్ లో జరిగిన బంధువుల పెళ్లికి హాజరై ఇంటికి తన ద్విచక్ర వాహనంపై తిరుగుపయనమయ్యాడు. మార్గమధ్యలో మండలంలోని రెడ్డినాయక్‌తం డా వద్ద అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టాడు. దీంతో సుమన్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే సుమన్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సుమన్ వరుసకు సోదరుడు వనం రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లాను మూడు కుటుంబాలే ఏలుతున్నాయ్

అభ్యర్థి మార్పు అబద్ధపు ప్రచారం : నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి

నల్లగొండ, మార్చి 28: జిల్లాను అనేక సంవత్సరాలుగా మూడు కుటుంబాల వారే ఏలుతున్నారని, అలాంటి వారికి స్వస్తి పలికి ఈసారి బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని నల్లగొండ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారని, అందరూ కలిసి పనిచేయాలని కోరారు. అభ్యర్థి మార్పు అనేది అబద్ధపు ప్రచారమని ఆయన పేర్కొన్నారు. దేశంలో బీజేపీ గెలవబోతున్న 400సీట్లలో నల్లగొండ ఎంపీ సీటు ఖచ్చితంగా ఉంటుందని నల్లగొండ గడ్డపై కాషాయజెండా ఎగురవేస్తామన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ నుంచి ఎంపీ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, తనను గెలిపిస్తే స్కిల్ యూనివర్సిటీ తీసుకువచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, కంటైనర్ పార్కు, డ్రై పోర్టు తీసుకువస్తానని అన్నారు. ఇప్పటికే జిల్లా రైస్‌హబ్‌గా మారిందని, ఇండస్ట్రియల్ కారిడార్ తీసుకవచ్చి పరిశ్రమలు నెలకొల్పుతామన్నారు. రాష్ట్ర స్థాయిలో బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక్కటై పనిచేశారని, బీఆర్ఎస్‌కు ఓటు వేసిన వృథా అన్నారు. ఎండిపోయిన పంటలకు ఎకరానికి రూ.25వేల చొప్పున ప్రభుత్వం చెల్లించాలని లేకుంటే ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. రూ.2లక్షల రుణమాఫీ ఎప్పుడు చేస్తారని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో సీనియర్ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు బండారు ప్రసాద్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పోతేపాక సాంబయ్య మన్మథరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం

● బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల కృష్ణారెడ్డి

నల్లగొండ, మార్చి 28: కాంగ్రెస్ పార్టీ వంద రోజుల పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని, అన్ని వర్గాల ప్రజలకు అన్యాయమే జరిగిందని బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయంపై ఆధారపడి 80శాతం మంది రైతులు జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వం మాత్రం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. రైతుబంధు, రుణమాఫీ రైతులకు చేరలేదని, పంటలు ఎండిపోతున్న స్పందించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు లేక ఇతర పార్టీల వారిని చేర్చుకుని టికెట్లు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతులకు ఎకరాకు రూ.15వేలు వేస్తామని చెప్పారని, రుణమాఫీ రూ.2లక్షలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలుచేయడంలో విఫలమైందని పేర్కొన్నారు. కేసీఆర్ అవసరం తెలంగాణకు ఎంత ఉందో ప్రతీ ఒక్కరికి తెలిసిందన్నారు. తాను ప్రజలకు సేవ చేసేందుకు పోటీలో ఉంటున్నానని ఒకసారి అవకాశం కల్పించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ మాట్లాడుతూ కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జానారెడ్డితో పాటు వెంకట్‌రెడ్డి కుటుంబాలు తరచుగా కేసీఆర్ కుటుంబాన్ని కుటుంబపాలన అంటూ విమర్శిస్తుంటారని, కేసీఆర్ కుటుంబం ప్రజలు, వారి సంక్షేమం కోసం కష్ట పడుతుంటారన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, నాయకులు చీర పంకజ్‌యాదవ్, మందడి సైదిరెడ్డి, ఆలకుంట్ల నాగరత్నరాజు, కరీంపాషా, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, బొమ్మరబోయిన నాగార్జున, జమాల్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన : నర్సయ్యగౌడ్



భువనగిరిలో ప్రచారం చేస్తున్న బూర నర్సయ్య గౌడ్

భువనగిరి రూరల్, రాజాపేట, మార్చి 28: బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో గురువారం నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని పీఎం మోదీ ప్రభుత్వం హయాంలో ఎయిమ్స్, కేంద్రీయ విద్యాలయం, పాస్‌పోర్ట్ కార్యాలయం, జాతీయ రహదారుల విస్తరణ, రైల్వేస్టేషన్ ఆధునికీకరణ తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. కేంద్రంలో మూడోసారి నరేంద్రమోదీ ప్రభుత్వం ఆశీర్వదించాలని కోరారు. రాజాపేట మండలం జాల గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత ఉపాధి కోసం జిల్లాలో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కొలనుపాక యాదగిరిగుట్ట భువనగిరి రాజాపేట, ప్రాంతాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కేంద్రం నుంచి ఎంపీ నిధులతో పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు వేముల అశోక్, విజయ భాస్కర్‌రెడ్డి, పడమటి జగన్మోహన్‌రెడ్డి, మాయ దశరథ పాదరాజు, ఉమాశంకర్, రత్నపురం బలరాం, పార్టీ రాజాపేట మండల అధ్యక్షుడు దాచేపల్లి రాజు, నాయకులు దాసరి మల్లేశం, పాశం భాస్కర్, ఊట్కూరి అశోక్‌గౌడ్, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, లక్ష్మణ్, సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

చిలుకూరు, మార్చి 28: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని పోలేనిగూడెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పోలేనిగూడెం గ్రామానికి చెందిన బత్తిని రేణుక (38) ఇంట్లో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. రోజువారీ పనుల్లో భాగంగా రేణుక ఇంటిపై ఉన్న ట్యాంక్‌లో నీళ్ల నింపేందుకు ఇం ట్లో ఉన్న విద్యుత్ మోటార్‌ను ఆన్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. భర్త బత్తిని శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు. మృతురాలు రేణుకకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆత్మహత్యకు కారణమైన నలుగురికి జైలు

వలిగొండ, మార్చి 28: వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన అత్తింటికి చెందిన నలుగురికి మూడేళ్ల జైలు, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ భువనగిరి కోర్టు తీర్పును వెలువరించింది. గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం... వలిగొండ మండలం చిత్తాపురం గ్రామానికి చెందిన డింగరి శేషాచార్యులు, శ్రీదేవిల కుమార్తె రోజాతో యాదాద్రి దేవస్థానం పూర్వ ప్రధానాచార్యులు కారంపూడి నర్సింహాచార్యుల కుమారుడు ప్రసాదాచార్యులతో 2015లో వివాహమైంది. ఈ దంపతులకు ఒక కుమార్తె ఉంది. వివాహం జరిగిన ఆరు నెలల నుంచి ప్రసాదాచార్యులపై అత్తింటి వారి వేధింపులు మొదలయ్యాయి. 2018 మార్చి 25న రోజా ఎవరికీ చెప్పకుండా తల్లిగారిలైన చిత్తాపురం గ్రామానికి వచ్చింది. భర్త ప్రసాదాచార్యులు ఆమెను వెతుక్కుంటూ రోజా వద్దకు వెళ్లాడు. అత్త, మామ, బావమరిది, భార్య వేధించారు. నీకు ఏం చేతకాదు, ఉద్యోగం లేదని, బతికున్నా దండగేనని, చావరాదురా అంటూ మానసికంగా క్షోభకు గురిచేశారు. తీవ్ర మనస్థాపానికి గురైన ప్రసాదాచార్యులు అత్తగారింటిలో ఉన్న పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆ మంటలను ఆర్పడానికి ఎవరూ ముందుకు రాకపోగా ఇంకా పెట్రోల్ కావాలా అని హేళన చేశారు. అతని పరిస్థితిని గమనించిన గ్రామస్థులు చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అదే రోజు మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 2018 మార్చి 28వ తేదీన ప్రసాదాచార్యులు మృతి చెందాడు. అతడి తండ్రి కారంపూడి నర్సింహాచార్యులు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఇద్రీస్ అలీ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం పోలీసులు తమ సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించి నేరం రుజువు కావడంతో మామ డింగరి శేషాచార్యులు, అత్త డింగరి శ్రీదేవి, బావమరిది డింగరి ఫణికుమార్, భార్య కారంపూడి రోజాలకు భువనగిరి అడిషనల్ అసిస్టెంట్ సెషన్ జడ్జి మూడేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా ను విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

భువనగిరి టౌన్, మార్చి 28: ఒక మహిళను హత్య చేసిన వ్యక్తికి యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయస్థానం గురువారం జీవిత ఖైదు శిక్ష విధించింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ కె. సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ధర్మగడండ తండా దేవరుప్పల మండలం వరంగల్ జిల్లాకు చెందిన వితంతువైన చౌడబోయిన లక్ష్మి ముగ్గురు పిల్లలతో కలిసి హైదరాబాద్ బంజారాహిల్స్ నందినగర్‌లో నివాసముండేది. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కుమార్ వెంకన్నతో పరిచయమైం ది. ఇరువురి మధ్య పెరిగిన పరిచయం కొద్ది రోజులు సాఫీగా సాగినా కొన్ని వివాదాలకు దారి తీసింది. ఈ నేపథ్యంలో మాట్లాడుకుందామని లక్ష్మిని 2020 నవంబరు 11వ తేదీన వెంకన్న ఆమెను ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లాడు. అయితే భువనగిరి జిల్లా ఆసుపత్రిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు అందిన సమాచారం మేరకు మరుసటి రోజ ఆసుపత్రికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించడంతో ఆ మృతదేహం ఆమె తల్లి లక్ష్మిదిగా గుర్తించారు. దీంతో కుమార్తెల ఫిర్యాదు మేరకు భువనగిరి పట్టణ అప్పటి సీఐ ఏ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వరంగల్ - హైదరాబాద్ రహదారి వెంట భువనగిరి సమీపంలో లక్ష్మిని నిందితుడు కుమార్ వెంకన్న కిరాతకంగా గొంతుకోసి తలపై బండరాయితో మోది హత్య చేసినట్లు తేలింది. ఈ మేరకు పూర్తి సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించడంతో హత్యానేరం రుజువుకావడంతో మొదటి అదనపు జిల్లా, సెషన్ జడ్జి కె.మారుతీదేవి కుమార్‌కు జీవిత శిక్షను విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని చర్లపల్లి జైలుకు తరలించారు. నిందితుడికి శిక్ష పడేలా సాక్ష్యాధారాలు సేకరించిన పోలీసులను, పీపీని కోర్టు అభినందించింది.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



పూజిత (ఫైల్)

నార్కట్‌పల్లి, మార్చి 28: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. భువనగిరి-యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం బీ.తుర్కపల్లి గ్రామానికి చెందిన దేవరపల్లి పూజిత తన సుమారు రెండేళ్ల వయసుగల బాబును తీసుకుని నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలులో ఉంటున్న తన అత్తమామల ఇంటికి ఈ నెల 26న వచ్చింది. బాబుకు పండ్లు తీసుకువస్తానని అత్తమామలకు చెప్పి కుమారుడిని ఇంట్లోనే వదిలి బయటికి వెళ్లిన పూజిత తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో ఇతర తెలిసిన వాళ్ల నుంచి పూజిత గురించి ఆరా తీసినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో పూజిత భర్త దేవరపల్లి వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

బీబీనగర్, మార్చి 28: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో గురువారం వెలుగుచూసింది. ఈ సంఘటనపై ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామానికి చెందిన మిర్యాల నర్సింహ (26) వృత్తిరీత్యా ఇనుప సామాన్లు విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వ్యక్తిగత ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. బుధవారం రాత్రి బీబీనగర్ మండల కేంద్రానికి చేరుకుని బ్రాహ్మణపల్లి రోడ్డులోని పంచముఖి వెంచర్‌లోకి వెళ్లి హైటెన్షన్ విద్యుత్ లైన్ టవర్‌కు ఉరేసుకున్నాడు. యువకుడి మృతదేహాన్ని గమనించి బ్రాహ్మణపల్లి గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. బీబీనగర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. నర్సింహ తల్లి చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో మునిగి రెండు ఎడ్లు మృతి

● కడిగేందుకు తీసుకెళ్లగా చెరువులో బండి బోల్తా పడటంతో దారుణం



మృతి చెందిన ఎడ్లు


మోత్కూరు, మార్చి 28: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపల్ పరిధిలో గురువారం చెరువులో మునిగి రెండు కోడెలు మృతి చెందాయి. రూ.లక్షా 5 వేలు పెట్టి కొనుగోలు చేసి తీసుకువచ్చిన రోజే ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మునిసిపల్ పరిధిలోని జామచెట్లబావి గ్రామానికి చెందిన దబ్బేటి సురేష్ గురువారం రూ.లక్షా ఐదువేలకు రెండు కోడెలను కొనుగోలు చేశాడు. వాటిని కడిగేందుకు బండితోనే చెరువులోకి తీసుకెళ్లాడు. చెరువులో ప్రమాదవశాత్తు బండి బోల్తాపడటంతో గేదెలు నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాయి. ఈ ఘటనతో రైతు కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బంగారు గొలుసు దొంగ అరెస్టు

చౌటుప్పల్ రూరల్ మార్చి 28: చౌటుప్పల్ మండలం తంగడపల్లిలో ఈ నెల 25వ తేదీన వృద్ధురాలి మెడలో నుంచి బంగారు పుస్తెల తాడును అపహరించిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన సిలువేరు ప్రవీణ్ డెలివరీ బోయ్‌గా పనిచేస్తున్నాడు. తంగడపల్లి గ్రామానికి చెందిన రాచకొండ పుష్పమ్మ ఇంటి ముందు కూర్చొని ఉండగా ద్విచక్రవాహనంపై వచ్చిన ప్రవీణ్ వృద్ధురాలి మెడలో నుంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించాడు. పుష్పమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రవీణ్‌ను అరెస్ట్ చేసి చౌటుప్పల్ కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

మంత్రి వెంకట్‌రెడ్డి సహకారంతో గెలుస్తాం

● భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



మంత్రి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 28: తనకు ఎంపీగా టికెట్ రావడానికి సహకరించిన రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి భువనగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనకు టిక్కెట్ ఖరారైన నేపథ్యంలో గురువారం ఆయన హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఘనవిజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్షాలపై వేధింపులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు పల్లా వెంకట్‌రెడ్డి

మునుగోడు, మార్చి 28: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ సంస్థలను ఉపయోగించి ప్రత్యర్థులను వేధింపులకు గురిచేస్తోందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి ఆరోపించారు. మునుగోడులో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ చర్యలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటమేనని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని బీజేపీ ఏతర పార్టీల నేతలను పలు అక్రమ ఆరోపణలు చేస్తూ ప్రధానంగా మనీలాండరింగ్ కేసుల పేరుతో ఈడీ, సీబీఐ వంటి స్వతంత్ర సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకొని స్వప్రయోజనాలకు వాడుకొంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. ఢిల్లీ, తెలంగాణ, కేరళ, వివిధ రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలకు చెందిన ప్రతిపక్షాల ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు మోపి జైళ్లలో బంధించడం శోచనీయమన్నారు. ఈ చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో బాధ్యులైన బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించి తగిన బుద్ధిచెబుతారని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, జిల్లా కమిటీ సభ్యుడు గురిజ రామచంద్రం, మండల సమితి కార్యదర్శి చాపల శ్రీను, గట్టుపల్లి నర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, కైలాసం పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

త్రిపురారం మార్చి 28: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. భక్తి భజన సంగీర్తన ప్రచార పరిషత్ అధ్వర్యంలో త్రిపురారం రామాలయం వద్ద భక్త భజన మండలి, బృందాలతో భక్తి పాటలు, భజన కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. మూడు రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, భారతిరెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, జానకిరాంరెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీను, సోమయ్య, శివప్రసాద్, సుధారాణి, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషిచేయాలి

మునుగోడు రూరల్, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం వేణుకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగ అశోక్‌గౌడ్ కోరారు. మండలంలోని కలకుంట్ల, చల్మెడ, కొంపెల్లి గ్రామాల్లో గురువారం జరిగిన పార్టీ బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. చల్మెడ బూత్ కమిటీ అధ్యక్షుడిగా కర్నాటి రమేష్, ప్రధాన కార్యదర్శి ఐతరాజు వంశీ, 148వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా దాం లింగస్వామి, ప్రధాన కార్యదర్శిగా గుండెబోయిన శంకర్, 149వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా సుర శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా పగిళ్ల మహేష్, 150వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా వడెపల్లి శంకర్, ప్రధాన కార్యదర్శిగా వీరమల్ల విజయ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్య క్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య, మాదగోని నరేందర్‌గౌడ్, బండారు యాదయ్య, మేక మాదవరెడ్డి, కర్నాటి శేఖర్, వీరమల్ల సురేష్, మొగుదుల లింగస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చామలకు టికెట్ కేటాయింపుపై సంబరాలు

శాలిగౌరారం, నకిరేకల్, మార్చి 28: మండల కేంద్రానికి చెందిన టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి భువనగిరి ఎంపీ టికెట్ కేటాయించడంతో కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం సంబరాలు జరుపుకున్నారు. శాలిగౌరారం, రామగిరి, ఉట్కూర్, వల్లాల, అడ్లూర్, ఆకారం, పెర్కకొండారం, తుడిమి డి గ్రామాల్లో బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చామల మహేందర్‌రెడ్డి, చింత ధనుంజయ్, చామల జైపాల్‌రెడ్డి, వడ్లకొండ పరమేష్, తోట పుల్లయ్య, బొల్లికొండ గణేష్ పాల్గొన్నారు. నకిరేకల్‌లో జరిగిన కార్యక్రమంలో డీసీసీ సంయుక్త కార్యదర్శి బొడ్డు నాగరాజు, గునగంటి రాజు, యానాల శ్రీనివాస్‌రెడ్డి, గణపురెడ్డి భిక్షంరెడ్డి బొప్పని యాదగిరి, అబ్దుల్ మాజిద్, ముత్యాల అంజి,వంటెపాక వెంకన్న, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రానికి డాక్టరేట్ ఆఫ్ బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు



అవార్డు అందుకుంటున్న వీరభద్రం

శాలిగౌరారం, మార్చి 28: మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన భీమనబోయిన వీరభద్రానికి న్యూఢిల్లీలోని హోప్ తీయలాజికల్ యూనివర్సిటీ డాక్టరేట్ ఆఫ్ బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు ప్రదానం చేసింది. వీరభద్రం హైద రాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో మూడు సంవత్సరాల నుంచి అమ్మ జ్యోతి అనాథ ఆశ్రయం ఏర్పాటు చేశారు. ఆయన సేవలను గుర్తించిన హోప్ తియాలజీకల్ యూనివర్సిటీ బుధవారం రాత్రి ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో వీరభద్రానికి అవార్డు అందజేసింది. వీరభద్రంను పలువురు అభినందించారు.

పార్లమెంట్ ఎన్నికలపై ఏప్రిల్ 1న సిబ్బందికి శిక్షణ

దేవరకొండ, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికల మొదటి విడత అధికారులకు దేవరకొండలోని మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 1న శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆర్డీవో శ్రీరాములు తెలిపారు. గురువారం దేవరకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలను ఎన్నికల కమిషన్ సూచించిన విధంగా నిబంధనలు పాటించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ట్రైనింగ్‌కు విధుల నిర్వాహణకు ఎంపికైన సిబ్బంది శిక్షణ తరగతులకు హాజరుకావాలన్నారు. దేవరకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల స్ట్రాంగ్‌రూం, డిస్ట్రిబ్యూటరీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. డిస్ట్రిబ్యూటరీ కేంద్రాలలో ఈవీఎంలను భద్రపరచనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



తిప్పర్తిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

తిప్పర్తి, మార్చి 28: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఐటీబీటీ పోలీస్ బలగాలతో పాటు సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌ఐ డి. రాజుతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు రక్షణగా ఉండి శాంతిభద్రతలను కల్పిస్తారన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహిస్తామని తెలిపారు.

రైతులు మద్దతు ధర పొందాలి



తిప్పర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న డీఎస్‌వో వెంకటేశ్వర్‌రావు

డీఎస్‌వో వెంకటేశ్వర్‌రావు

తిప్పర్తి, మార్చి 28: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి రైతులు ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని డీఎస్‌వో వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకువచ్చిన వెంటనే మ్యాయిచర్ 17శాతం వచ్చే వరకు ఆరబెట్టుకోవాలని సూచించారు. తద్వారా ప్రభుత్వం కల్పించే రూ.2,203 మద్దతు పొందవచ్చని తెలిపారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనందున రైతులు తొందరపాటు నిర్ణయాలు తీసుకొని బయటి వ్యాపారులకు ధాన్యం అమ్ముకొని నష్టపోవొద్దని సూచించారు. సరైన ధాన్యం ఉన్న రైతులను రోజుల తరబడి మార్కెట్‌లో పడిగాపులు పడనివ్వకుండా మార్కెట్ నిర్వాహకులు త్వరతగతిన కాంటాలు వేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం నాగేశ్వర్‌రావు, ఎంపీడీవో వెంకట్‌రెడ్డి, ఏవో సన్నిరాజు, సీఈవో పి. భిక్షమయ్య, ఏఈవోలు సంతోషిని, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేయాలి

నల్లగొండ రూరల్: రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డీఆర్‌డీఏ పీడీ టీ. నాగిరెడ్డి అన్నారు. మండలంలోని ఖాజిరామారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కొనుగోలు చేసిన ధాన్యం ట్రక్‌షీట్లను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. తేమ 17శాతం మించకుండా కళ్లాల వద్దే ధాన్యం ఆరబెట్టి కొనుగోలు కేం ద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రం వద్ద ఆధార్ కార్డు, పట్టదారు పాసుబుక్, బ్యాంక్ ఖాతాలను తీసుకొని ఓటీపీ నమోదు చేసుకోవాలన్నారు. తేమ శాతం 17లోపు ఉండి, ఓటీపీ రాకుంటే కొనుగోలు చేయడం వీలుకాదన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా ముందుగానే సరి చూసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు రెండు, మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేసే విధంగా చేస్తామన్నారు.



ఖాజిరామారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి

సీరియల్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని, కొనుగోలు చేయడంలో రైతులకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి. వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో సునకోజు శ్రీనివాస్, ఏఈవో డీపీఎం అరుణ్‌కుమార్, ఏపీఎం వినోద, సీసీ గీత, సంఘం బంధం అధ్యక్షురాలు నకిరేకంటి లక్ష్మీ, కార్యదర్శి అండాలు, రాచకొండ సూజాత, వీవోఏ కృష్ణవేణికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండ లకేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పంట పొలాలు కోసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చినా ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు శ్రీకర్, అశోక్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకన్న, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిత : జడ్పీ సీఈవో



సదస్సులో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

మిర్యాలగూడ, మార్చి 28: యువత చేతుల్లోనే దేశ భవిత ఉందని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మీనా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన ఓటరు చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజల చేతిలో ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. దానిని సద్వినియోగం చేసుకుని మంచి నేతలను ఎన్నుకుని ప్రజాస్వామ్యాన్ని పరిడవిల్లేల్లా చూడాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు. కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంతాలకు అతీతంగా యువతీ యువకులు తమ ఓటును వినియోగించుకొని, తమ కుటుంబసభ్యులు కూడా ఓటు వేసేలా చొరవ తీసుకోవాలని కోరారు. భారత ఎన్నికల సంఘం పౌరులకు కల్పించిన వివిధ రకాలైన యాపులను వినియోగించుకుని ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత అంబాసిడర్స్‌గా యువత పైనే ఉందన్నారు. కార్యక్రమంలో సీవీప్ జిల్లా నోడల్ అధికారి, డీఎల్‌పీవో రాఘవరావు, మాస్టర్ శిక్షకులు గుడిపాటి కోటయ్య, అంబటి శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ బార్ అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డి



రామకృష్ణారెడ్డి, వేలాద్రి

మిర్యాలగూడ లీగల్, మార్చి 28: మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జి. రామకృష్ణారెడ్డి విజయం సాధించారు. ఆయన తన ప్రత్యర్థి ఎం. రాజేష్‌పై 43ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. మొత్తం 125 ఓట్లు పోల్ కాగా, రామకృష్ణారెడ్డికి 80, రాజేష్‌కు 40ఓట్లు వచ్చాయి. రెండు ఓట్లు చెల్లలేదని ఎన్నికల అధికారులు తెలిపారు. జనరల్ సెక్రటరీగా సకినాల వేలాద్రి తన ప్రత్యర్థి ఎ. రాజ్‌కుమార్‌పై మూడు ఓట్లతో విజయం సాధించారు. జాయింట్ సెక్రటరీ-2 పదవికి మోదాల మల్లేష్ తన ప్రత్యర్థి సీహెచ్‌వీడి. ప్రసాద్‌పై 73ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. కమిటీని న్యాయమూర్తులు జి. వేణు, సుజయ్, సుమబాల అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె. ప్రతాప్‌రెడ్డి, పి. రవీంద్రరెడ్డి, మాలి ఉమాశంకర్‌రెడ్డి, రామరంగారావు, వాకిటి శ్రీనివాస్, కె. శ్రీనివాస్‌రెడ్డి, తాళ్లపల్లి రాములు ఉన్నారు.

నూతన కార్యవర్గం: బార్ అసిసోసియేషన్ అధ్యక్షుడిగా జి. రామకృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీ సకినాల వేలాద్రి, ఉపాధ్యక్షుడు-1 ఎండి. ఇబ్రహీం, ఉపాధ్యక్షుడు-2 పయ్యల స్వామిప్రసాద్, జాయింట్ సెక్రటరీ-1 కందిమళ్ల వెంకట్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ-2 మోదాల మల్లేష్, ట్రెజరర్ ఎం.వెంకటపవన్‌కుమార్, గేమ్స్ సెక్రటరీ బానాల ఉమాశంకర్, లైబ్రరీ సెక్రటరీ డి.రవి, మహిళ ప్రతినిధి బానోతు జ్యోతి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లు కస్తూరి నాగేందర్, రాయారపు భాస్కర్, గంగాభవాని, ఖమ్మంపాటి రామకృష్ణ ఎన్నికయ్యారు.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా లింగయ్య



చిట్యాల: రామన్నపేట బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా చిట్యాలకు చెందిన అడ్వకేట్ గాలి లింగయ్య ఎన్నికయ్యారు. గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎలక్షన్ ఆఫీసర్ శోభన్‌బాబు తెలిపారు. లింగయ్యను పలువురు అభినందించారు.

కార్యకర్తల అభీష్టం మేరకు నిర్ణయం : పిల్లి



మాట్లాడుతున్న రామరాజుయాదవ్

నల్లగొండ, మార్చి 28: కార్యకర్తల అభిప్రాయం మేరకు ఒకటి రెండు రోజుల్లో భవిష్యత్తు రాజకీయ నిర్ణయాన్ని ప్రకటిస్తానని ఏఐఎఫ్‌బీ నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి రామరాజుయాదవ్ తెలిపారు. జిల్లాకేంద్రంలో గురువారం జరిగిన ఏఐఎఫ్‌బీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను నమ్ముకుని వెంట నడిచిన కార్యకర్తల నిర్ణయానికి అనుగుణంగా కార్యాచరణ రూపొందిస్తానన్నారు. తమ వెంట నడిచిన కార్యకర్తలను మర్చిపోలేనన్నారు. అనేక ఆటంకాలు ఎదురైనా అసెంబ్లీ ఎన్నికల్లో ధైర్యంగా ఎదుర్కొని సుమారు 30వేల ఓట్ల వరకు సాధించి ప్రజల హృదయాలను గెలుచుకోవడం కార్యకర్తలతోనే సాధ్యమైందన్నారు. కార్యకర్తలు, ప్రజల భవిష్యత్తు కోసం రాజకీయ నిర్ణయం తీసుకునే సమయం ఆసన్నమైందన్నారు. కార్యకర్తల నిర్ణయయే తనకు శిరోధార్యమని, వారి సలహాలు, సూచనల మేరకే భవిష్యత్తు కారాచరణ రూపొందిస్తామని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రేఖారెడ్డి

కొండమల్లేపల్లి, మార్చి 28: వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దూదిపాల రేఖరెడ్డి అన్నా రు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. మండలంలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కా రానికి చొరవ చూపాలన్నారు. ఇంటింటికీ తాగునీరు అందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ పథకం ఇప్పటి వరకు పలు గ్రామాల్లో అందడం లేదని, పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఎంపీటీసీలు సమావేశంలో ప్రస్తావించారు. మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం ఎన్నికల కోడ్ నిబంధనలతో ఎలాంటి తీర్మానాలు చేయకుండానే పది నిమిషాల్లో ముగించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పస్నూరి సరస్వతమ్మ, ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు



కంటైనర్ లారీని ఢీకొన్న లారీ

చిట్యాల రూరల్, మార్చి 28: మండలంలోని వట్టిమర్తి గ్రామ శివారులో గురువారం ఆటో ఆగిఉన్న కంటైనర్ లారీని ఢీకొని ఆరుగురికి గాయాలయ్యాయి. చిట్యాల నుంచి నల్లగొండకు ప్రయాణికులతో వెళ్తున్న టీఎస్05 యూఏ6742 నంబరు గల ఆటో వట్టిమర్తి శివారులోని దాబాల సమీపంలోకి రాగానే హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపునకు వెళుతున్న లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న కంటైనర్ లారీని ఢీకొట్టింది. ఆటోలో ఉన్న పల్లపు కళమ్మ, పల్లపు యాదమ్మ, వెంకన్న, జెట్టి యాదయ్య, ఎస్‌కె. చాంద్‌మియా, కైరంకొండ శ్రీకాంత్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి శివారులోని కామినేని ఆసుపత్రికి తరలించారు. చిట్యాల మండలం వట్టిమర్తికి చెందిన పల్లపు వెంకన్న, నార్కట్‌పల్లికి చెందిన ఆటో డ్రైవర్ జెట్టి యాదయ్య తీవ్రంగా గాయపడ్డారు. గాయాలయ్యాయి. శ్రీకాంత్ తండ్రి కైరంకొండ మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. సైదాబాబు తెలిపారు.

ఘనంగా వేణుగోపాలస్వామి రథోత్సవం



రథోత్సవం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కనగల్, మార్చి 28: మండలకేంద్రంలో వారం రోజులుగా జరుగుతున్న వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. చివరిరోజు ఉత్సవ విగ్రహాలను అలకరించిన ప్రత్యేకరథంపై ప్రతిష్ఠించి ఊరేగించారు. భక్తులు రథం ముందు నీళ్లారబోసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించు కున్నారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు అక్కినేపల్లి తిరుమల్‌నాథ్, శ్రీనివాసరావ్, శ్రీనివాస్‌చక్రవర్తి మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచులు సునీతాక్రిష్ణయ్యగౌడ్, చిట్ల లింగయ్యగౌడ్ నాయకులు నర్సింగ్ లక్ష్మయ్యగౌడ్, నర్సింగ్ మురళిగౌడ్. జానయ్యగౌడ్ ఉన్నారు.

కార్మికులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, మార్చి 28: కార్మికులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని హమాలీ సంఘం గౌరవ అధ్యక్షుడు రావుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీట్ మార్కెట్‌లో పనిచేసే హమాలీలకు గురువారం డాక్టర్ పుల్లారావు ఫిటనెస్ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం గౌరవ అధ్యక్షుడు యామ దయాకర్, మల్లయ్య, శంకర్, నరసింహ, యాదగిరి, రాములు ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ఎండిన వరిచేనును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, మార్చి 28: సాగునీరు లేక వరిపొలాలు ఎండిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. మండలంలోని చిన్ననారాయ ణపురంలో సాగునీరందక ఎండిన వరి పొలాలను గురువారం పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో సాగునీరు లేక పంటలు ఎపుడూ ఎండిపోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి పంటనే పశువులకు మేతగా మారడం దురదృష్టకరమన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, యానాల అశోక్‌రెడ్డి, కొండూరు శంకరయ్య, మాజీ సర్పంచులు కొత్త నర్సింహ, అలుగుబెల్లి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

'టెట్' దరఖాస్తుల ఫీజులు తగ్గించాలి

మిర్యాలగూడ, మార్చి 28: టెట్ దరఖాస్తు ఫీజులు తగ్గించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్ డిమాండ్‌చేశారు. గురువారం జరిగిన సంఘం డివిజన్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన తప్పుతను ఈ ప్రభుత్వం చేయవద్దని కోరారు. యూత్ డిక్లరేషన్ పేరుతో యువతకు ఆశలు కల్పించి ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో ఖచ్చితమైన నిర్ణయాలు చేయాలన్నారు. గతంలో టెట్ పరీక్షకు సంబంధించి ఫీజు రూ.300 ఉండేదని, ప్రస్తుతం ఒక్క పరీక్షకు రూ.1000 చొప్పున మొత్తం రూ.2000 ఫీజు వసూలు చేస్తొన్నారని అన్నారు. టెట్ నిర్వహణ కేంద్రాలను పెంచాలన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ నాయకులు వినోద్, శ్రీను, రాజు, నాగేష్, ఆశీర్వాదం పాల్గొన్నారు.



హాలియా: అనుముల మండలం పేరూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోల్లోజు సాయిశ్రీ, సహోపాధ్యాయులు బొమ్మరబోయిన స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్ వనజాకుమారి, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: కాంగ్రెస్ పార్టీ బీసీలను మరోమారు మోసం చేసిందని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. మిర్యాలగూలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా పార్లమెంట్ అభ్యర్థులుగా రెడ్లను ప్రకటించడం తగదన్నారు. జనాభాలో అధికశాతమున్న బీసీలను విస్మరించి రెండు స్థానాలు ఒకే సామాజిక వర్గానికి ఇవ్వడం బీసీలను అవమానించడమేన్నారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, సంజీవ్, బ్రహ్మచారి, రవి, వంశీ ఉన్నారు.

శాలిగౌరారం: బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటానని వేరే పార్టీలోకి వెళ్లే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ మండల మాజీ మండల అధ్యక్షుడు కట్టా వెంకటరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు కొంతమంది పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని, అసత్య ప్రచారాలను నమ్మొద్దన్నారు.

కొండమల్లేపల్లి: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మట్టపల్లిలో ఈనెల 30న నిర్వహించే నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ సభకు భారీగా తరలివెళ్లనున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని అన్ని కాలనీలకు కృష్ణాజలాలు సరఫరా చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్యయాదవ్ ఒక ప్రకటనలో కోరారు. వేసవి కారణంగా పట్టణంలో కృష్ణాజలాలు అరకొరగా సరఫరా చేస్తున్నారని తెలిపారు. కొన్ని కాలనీల్లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి కృష్ణాజలాలు సరఫరా అవుతున్నాయని దీంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. రోజు విడిచి రోజువారిగా కృష్ణాజలాలు సరఫరా చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

కట్టంగూరు: మండలంలోని మునుకుంట్లలో సర్వేనెంబర్ 602/1 కబ్రాస్తాన్‌ను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన ముస్లింలు గురువారం నల్లగొండలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన రవి, వీరయ్య చెరువులోని మట్టితో అక్రమంగా సమాధులు పూడ్చి అవులను, బర్రెలను కట్టివేయడంతో పాటు గడ్డివాములను వేసి గోరీలు ఉన్న స్థలాన్ని కబ్జా చేశారని ఫిర్యాదు చేశారు. అనంతరం కట్టంగూర్ ఎస్‌ఐ, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వారిలో ఎస్‌కె. బాబా, ఎస్‌కె. ఖాసీం, ఎస్‌కె.ఫర్వీన్, ఎస్‌కె. సైదాబీ, షేక్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరు: పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి స్థానాన్ని బీజేపీ గెలుచుకుంటుందని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్ అన్నారు. మండలంలోని అయిటిపాముల గ్రామంలో కేంద్రం ద్వారా అందుతున్న పథకాలు పొందిన లబ్ధిదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు.

నార్కట్‌పల్లి: మండలంలోని అక్కెనపల్లి గ్రామానికి మీ సేవ కేంద్రాన్ని మంజూరు చేయాలని గ్రామ మాజీ ఎంపీటీసీ కొమ్ము యాదయ్య కోరారు. నార్కట్‌పల్లి తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. గ్రామానికి మంజూరైన మీ సేవ కేంద్రాన్ని అమ్మనబోలుకు బదలాయించడం సమంజసం కాదన్నారు.

మిర్యాలగూడ: పట్టణంలోని రెడ్డికాలనీలో నూతనంగా నిర్మించిన బీఆర్ఎస్ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు పార్టీ కార్యాలయం ప్రారంభించనున్నందున బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

తిరుమలగిరి(సాగర్): పెద్దవూర మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుమలగిరి(సాగర్) మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన కటికల మధు తీవ్ర గాయాలపాలు కాగా మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మాజీ ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి గురువారం ఆసుపత్రికి వెళ్లి మధును పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

గట్టుప్పల్: భువనగిరి కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని గట్టుప్పల్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్ అన్నారు. వెల్మకన్న గ్రామంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ ఆదరిస్తున్నారని, అలాగే ఈ ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఈ సమావేశంలో నాయకులు యాదగిరిరెడ్డి, శ్రీరాములు, నగేష్, నవీన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



హాలియా: అల్వాల ఎక్స్‌రోడ్డుకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయ కుడు శ్రీనునాయక్ ఆకాల మృతిచెందడంతో గురువారం సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుం బానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కర్నాటి లింగారెడ్డి, శంకర్‌నాయక్, తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాండునాయక్, నెర్మటి వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.